 ఈనాడు


# 'కబుర్ల దేవత'కు బాలసాహిత్య పురస్కారం

**● మైరావణకు యువసాహిత్య పురస్కారం ● రచయితలు డాక్టర్ గంగిశెట్టి శివకుమార్, ప్రసాద్ సూరి**

ఈనాడు, దిల్లీ, నెల్లూరు(మార్కెట్‌సెంటర్), న్యూస్‌టుడే: కేంద్ర సాహిత్య అకాడమీ బుధవారం ప్రకటించిన సాహిత్య పురస్కారాల్లో డాక్టర్ గంగిశెట్టి శివకుమార్ రాసిన 'కబుర్ల దేవత'కు బాలసాహిత్యం, ప్రసాద్ సూరి రచించిన 'మైరావణ'కు యువసాహిత్య పురస్కారాలు లభించాయి. 2025 సంవత్సరానికి సాహిత్య అకాడమీ 24 భాషల్లో బాల, 23 భాషల్లో సాహిత్య పురస్కారాలను ప్రకటించింది. బాలసాహిత్య పురస్కారానికి ఎంపికైన 'కబుర్ల దేవత' రచయిత డాక్టర్ గంగిశెట్టి శివకుమార్ శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రాపూరుకు చెందినవారు. తండ్రి ప్రోత్సాహంతో చిన్నప్పటి నుంచి బాలసాహిత్యంపై మక్కువ పెంచుకొని అందులో రాణించారు. నాలుగో తరగతిలో ఉండగా తొలిసారి గ్రంథాలయానికి వెళ్లి 'అలీబాబా 40 దొంగలు' పుస్తకం చదివిన ఆయన అప్పటి నుంచి బాలల కథలపై ఆసక్తి పెంచుకున్నారు. తర్వాత రోజూ గ్రంథాలయానికి వెళ్లి కథలు చదివేవారు. తండ్రికి బదిలీ కావడంతో గూడూరుకు మారారు. అక్కడ బీఎస్సీ వరకు చదివిన ఆయన తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో తెలుగులో ఎంఏ, బాలల కథలపై పీహెచ్‌డీ చేశారు. సహస్రావధాని మేడసాని మోహన్ ఈయన సహాధ్యాయి. తొలుత దైవసహాయం అనే కథ రాశారు. 1970లో ఆయన రచించిన 'కబుర్ల దేవత' కథ బాలానందం పుస్తకంలో ప్రచురితమైంది. అదే పేరుతో 2023లో రాసిన రచనలకు ఇప్పుడు బాలసాహిత్య పురస్కారం లభించింది. 1973లో 'యథారాజా తథాప్రజ' పేరుతో రాసిన కథ చందమామలో ప్రచురితమైంది. తర్వాత అదే పత్రికలో వందకు పైగా కథలు ప్రచురితమయ్యాయి. 2012లో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పదవీవిరమణ చేశారు. తర్వాతి నుంచి పున్నమి మాసపత్రికకు గౌరవ సంపాదకుడిగా పనిచేస్తున్నారు. ఈయన రాసిన కష్టనష్టాలు, అసూయ, మాటల్లో తేడా కథలను ఏపీ, కర్ణాటక ప్రభుత్వాలు ప్రాథమిక విద్యార్థులకు పాఠ్యాంశాలుగా ఇచ్చాయి. 2005లో ఏపీ ప్రభుత్వం నుంచి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు పొందారు. ఈయన కథలపై పరిశోధనలు చేసి ఇద్దరు పీహెచ్‌డీలు పొందారు.



కబుర్లదేవత ముఖచిత్రం



మైరావణ పుస్తక ముఖచిత్రం

## 58 ఏళ్లుగా బాలసాహిత్యంతోనే నా జీవితం



'నేను రాసిన కథలను 2023లో 'కబుర్ల దేవత'గా పుస్తకరూపంలో తీసుకొచ్చాం. దీనికి కేంద్ర సాహిత్య అకాడమీ వారి బాలసాహిత్య పురస్కారం దక్కడం సంతోషంగా ఉంది. నేను బాల సాహిత్యంలో రాణించేందుకు నా గురువులు నాగయ్య, వెంకటప్పయ్య, రాజారాం ఎంతగానో సహకరించారు. నా జీవితం 58 ఏళ్లుగా బాలసాహిత్యంతో ముడిపడింది. పిల్లలకు నీతి చెప్పడం ద్వారా వాళ్లలో వ్యక్తిత్వాన్ని వికసింపజేయవచ్చన్న నమ్మకంతోనే బాల సాహిత్యాన్ని ఎంచుకున్నా.'

– గంగిశెట్టి శివకుమార్

## విశాఖవాసి ప్రసాద్ సూరి



యువ పురస్కారానికి ఎంపికైన 'మైరావణ' రచయిత ప్రసాద్ సూరి విశాఖపట్నానికి చెందినవారు. ఈయన అసలు పేరు సూరాడ ప్రసాద్. విశాఖపట్నం జిల్లా రాంబిల్లి మండలం వాడరాంబిల్లిలో 2000 డిసెంబర్ 12న జన్మించారు. హైదరాబాద్‌లోని జేఎన్ఏఎఫ్‌యూలో 2019-24 మధ్య బీఎఫ్ఏ చేశారు. చరిత్రపై ఆసక్తితో ప్రస్తుతం గుజరాత్‌లోని వడోదరలో ఎంఏ ఆర్కియాలజీ రెండో సంవత్సరం చదువుతున్నారు. ఈయన మత్స్యకార కుటుంబానికి చెందినవారు. ఇంట్లో చదువుకున్నవారెవ్వరూ లేకపోయినా సొంతంగా తెలుగు సాహిత్యంపై మక్కువ పెంచుకొని రచనా వ్యాసంగం కొనసాగించారు. తెలివి, ధైర్యం, బలం ఉన్నవాడికి అదృష్టం కలిసి వస్తే ఏం చేస్తాడన్న ఇతివృత్తంతో మైరావణ పుస్తకం రాశారు. ఇది విశాఖ తీరప్రాంతంలో చేపలు పట్టే బెస్తవాళ్ల జీవితకథ. దాని ముఖచిత్రంపై బొమ్మను సొంతంగా గీశారు. 'మైనేమ్ ఈజ్ చిరంజీవి' ఈయన తొలి రచన.